సిరుల తల్లికి లక్ష కుంకుమార్చన


లక్ష కుంకుమార్చన పూజలో పాల్గొన్న ఉభయదాతలు


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మి ఆలయంలో లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా మంగళవారం నిర్వహించే ఈ ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నిర్వహించారు. లక్ష కుంకుమార్చన పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.10 వేలు చెల్లిస్తే వారి తరపున నలుగురు దంపతులు పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. పూజా సామగ్రి దేవస్థానమే సమకూర్చుతుందని తెలిపారు. అమ్మవారిని డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్ డాక్టర్ గుడ్ల తనూజ దంపతులు దర్శించుకున్నారు.

ఘనంగా శ్రీచక్రనవవర్ణార్చన

కనకమహాలక్ష్మి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రనవవర్ణార్చన, లక్ష్మీహోమం ప్రత్యేక పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన పూజలో ఇద్దరు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి నెల పౌర్ణమి రోజున నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.2,516 చెల్లిస్తే దంపతులను అనుమతించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజా సామగ్రి దేవస్థానమే సమకూర్చుతుందని తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువుదీరిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొని తరించారు. ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

3న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 3న సహస్ర తులసి పూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించాలన్నారు.

గణేషన్నా.. బాగున్నావా..


ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: విశాఖ పర్యటనకు మంగళవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా గణేషన్నా.. బాగున్నావా.. అంటూ ముఖ్యమంత్రి ఆప్యాయంగా పలకరించారు.

శ్రీవత్సవ్‌కు ఆప్యాయ పలకరింపు


శ్రీవత్సవ్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీవత్సవ్‌ను సీఎం ఆప్యాయంగా పలకరిస్తూ ద్రోణంరాజు శ్రీనివాసరావు కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

రామాలయంలో హనుమాన్ చాలీసా పారాయణ


హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: మహారాణిపేటలో గల శ్రీ కనక మహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ రామాలయంలో మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. శ్రీమాత్రే నమః సంస్థ సభ్యురాలు కోడుమూరి కృష్ణవేణి, తదితరులు 27 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి

అల్లిపురం: గుర్తు తెలియని వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 27న రాత్రి ఒక వ్యక్తి నడుచుకుంటూ వచ్చి ఆర్టీసీ కాంప్లెక్స్ బస్టాపు వద్ద పడిపోయారు. అతడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గత నెల 30న రాత్రి మృతి చెందారు. మృతుని వయసు 65 సంవత్సరాలు ఉంటాయని, ఆచూకీ తెలిసిన వారు 0891 – 2783672, 9440904716లో సంప్రదించాలని సీఐ కోరారు.

ఘనంగా మన్యు సూక్త హోమం


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహారాణిపేట: స్థానిక శ్రీఆంజనేయస్వామి ఆలయంలో అధిక శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని మన్యు సూక్త హోమం మంగళవారం ఘనంగా జరిగింది. ప్రతి నెల పౌర్ణమి తిథి నాడు ఆలయంలో మన్యు సూక్త హోమం నిర్వహించడం ఆనవాయితీ. నరఘోష, శత్రుఘోష, రుణబాధ నివారణ, గ్రహ శాంతి, కార్యసిద్ధి కోసం ఈ హోమం నిర్వహించారు. హోమంలో పాల్గొన్న దంపతులకు ప్రసాదం అందజేశామని ఈవో అల్లు జగన్నాథం తెలిపారు.

సత్యదేవుని సన్నిధిలో ఎమ్మెల్యే

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మంగళవారం సత్యదేవుడిని దర్శించుకున్నారు. పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలో ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ధ నాగ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో యువత భవిత నాశనం


అవగాహన కల్పిస్తున్న కంచరపాలెం పోలీసులు

మద్రిపాలెం: మత్తు పదార్థాలు సేవించడం వల్ల యువత భవిష్యత్తు ప్రమాదకరంగా మారుతుందని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ ఎన్.సాయి అన్నారు. ఈ మేరకు కైలాసపురంలోని కస్తూరినగర్ జంక్షన్‌లో యువతకు, ప్రజలకు మంగళవారం ప్రత్యేక వాహనం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. డ్రగ్స్‌కు, మద్యానికి, చెడు అలవాట్లకు దూరంగా యువత ఉండేలా తల్లిదండ్రులు చూడాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిత్యం నిఘా ఉంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రవికిషోర్, దివ్యభారతి పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించాలి


అవగాహన కార్యక్రమంలో తల్లిపాలు విశిష్టతపై వివరిస్తున్న మంగమ్మ


సమావేశంలో డీఐవో జీవన్‌రాణి, డీపీఎంవో రమణ, డాక్టర్ నర్మద తదితరులు

అల్లిపురం: వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ఆగస్టు నెలలో చేపట్టే కార్యక్రమాలపై ఆశ వర్కర్లు దృష్టి సారించాలని డిప్యూటీ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ జీవన్‌రాణి ఆదేశించారు. ఈ మేరకు ఆమె మంగళవారం భీమ్‌నగర్, డాక్టర్ వైఎస్సార్ అర్బన్ క్లినిక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 8 వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లులకు, బాలింతలకు అవగాహన కల్పించాలని సూచించారు. తగిన విధంగా ప్రచారం చేపట్టాలన్నారు. 10న పాఠశాల విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు మాత్రలు అందజేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇమ్యునైజేషన్ కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం చేపట్టాలన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నియంత్రణకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నర్మద, డీపీఎంవో రమణ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టాలి

డాబాగార్డెన్స్: పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టాలని అంగన్‌వాడీ వర్కర్ యూఏ మంగమ్మ గర్భిణులకు సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కనకలదిబ్బ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు తాగడం వల్ల శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కే పి.లక్ష్మి, పి.వరలక్ష్మి, ప్రమీల పాల్గొన్నారు.

ఉదయమే ఇంటింటికీ క్లాప్ వాహనం వెళ్లాలి

జగదాంబ: ఉదయం 6 గంటలకే చెత్త సేకరణకు ఇంటింటికీ తప్పకుండా క్లాప్ వాహనం వెళ్లాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో సత్యనారాయణ ఆదేశించారు. మంగళవారం ఆయన జోన్ పరిధిలోని వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానం లక్ష్యంగా ఇంటింటికీ క్లాప్ వాహనం వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. శానిటరీ సెక్రటరీలు బాధ్యతగా విధులు నిర్వహిస్తూ క్లాప్ వాహనం రాకపోకల వివరాలు నమోదు చేయాలన్నారు. రహదారులపై, కాలువల్లో చెత్త ఉండకూడదన్నారు. ప్రతి ఇంటిలో మూడు రకాలు డస్ట్‌బిన్లు తప్పక ఉండాలని సూచించారు. దుకాణాల వద్ద కూడా చెత్త బుట్టలు తప్పకుండా ఉపయోగించాలన్నారు.

గంజాయి మత్తులో జోగుతున్న 12 మందికి రిమాండ్

పీఎం పాలెం: గంజాయి మత్తులో జోగుతున్న 12 మందిని పీఎం పాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ... విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం రాత్రి మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీలో గంజాయి రవాణా చేస్తున్న లక్ష్మణ, కృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కేజీన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారు ఇచ్చిన సమాచారంతో దేవీమెట్ట ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న అనిల్ కుమార్, నరసింహారావు, శెట్టి, భవానీ ప్రసాద్, మహమ్మద్ ఇర్ఫాన్, వెంకటేష్, శ్రీను, నరేష్, బెహరాతోపాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి చిన్నచిన్న గంజాయి ప్యాకెట్లు, 7 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ వై.రామకృష్ణ తెలిపారు.

రోడ్డు పక్కన గాయాలతో యువతి

కొమ్మాది: తిమ్మాపురం నుంచి మారికవలస వెళ్లే మార్గ మధ్యలో ఓ యువతి స్వల్ప గాయాలతో రోడ్డు పక్కన స్పృహ తప్పి పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బీచ్ రోడ్డు తిమ్మాపురం రోడ్డులో వాటర్ ట్యాంక్ సమీపంలో మంగళవారం సాయంత్రం ఓ యువతి స్వల్ప గాయాలతో, చిరిగిన దుస్తులతో రోడ్డు పక్కన పడి ఉంది. ఆమె స్నేహితులు ఎవరితోనైనా వచ్చిందా..? లేక ఎవరైనా కొట్టి ఇక్కడ పడేశారా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. నడుము, చేతులపై గాయాలు ఉన్నాయి. చేతిపై పచ్చబొట్లు ఉన్నాయి. సాయంత్రం ఇటుగా వాకింగ్‌కు వెళ్తున్న పలువురు ఆమెను చూసి 108 అంబులెన్స్, పోలీసులకు సమాచారం అందించడంతో వారు చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. ఆ అమ్మాయి నగరంలోని రెల్లివీధికి చెందిన వేణుకుమారిగా గుర్తించినట్లు సీఐ డి.రమేష్ తెలిపారు. ఆమె స్పృహలోకి వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

ఎండీఎం కార్మికులకు నిధులు పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న దయా రమాదేవి

డాబాగార్డెన్స్: మధ్యాహ్న భోజన పథక (ఎండీఎం) కార్మికులకు బడ్జెట్‌లో నిధులు పెంచాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి కోరారు. యూనియన్ 4వ జిల్లా మహాసభ మంగళవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల మంది ఉన్నారని, విశాఖలో 900 మంది ఉన్నారన్నారు. వీరి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేకుంటే సెప్టెంబర్ 8న విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్టు చెప్పారు. అనంతరం 31 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. విశాఖ జిల్లా అధ్యక్షురాలిగా ఎస్.సీతాభవాని, ప్రధాన కార్యదర్శిగా జి.మంగశ్రీ, కోశాధికారిగా కె.కళాచందనతోపాటు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిటూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, శ్రామిక మహిళ కన్వీనర్ పి.మణి, రాము, భవానీ, రాంబాయి, మంగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి


రామకృష్ణ జంక్షన్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గొయ్యి వద్ద ఏర్పాటు చేసిన స్టాపర్లు

జగదాంబ: రామకృష్ణ జంక్షన్ దరి ప్రధాన రహదారిలో ఓ పెద్ద గొయ్యి కారణంగా రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. 75 ఫీట్ రోడ్డులో ఇటీవల కురిసిన వర్షానికి ఈ గొయ్యి ఏర్పడింది. మ్యాన్‌హోల్ పక్కనే ఈ గొయ్యి ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గొయ్యి వద్ద కేవలం డైవర్షన్ బోర్డులు పెట్టి వదిలేశారు. అధికారులు త్వరితగతిన స్పందించి గొయ్యి పూడ్చకపోతే మళ్లీ వర్షం పడే సమయంలో పక్కనే ఉన్న యూజీడీ కూడా పూర్తిగా కిందకు కుంగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా ప్రేమ సమాజం అధ్యక్షుడు శివాజీ జన్మదిన వేడుకలు


వేడుకలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

డాబాగార్డెన్స్: స్థానిక ప్రేమ సమాజంలో మంగళవారం సాయంత్రం ప్రేమ సమాజం నూతన అధ్యక్షుడు బుద్ధ శివాజీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు శివాజీని సత్కరించారు. అనాథలు, వృద్ధుల నడుమ శివాజీ కేక్ కట్ చేశారు. సభాధ్యక్షుడు విశ్వేశ్వరరావు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, ఎండోమెంట్ అధికారి శిరీష, జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, ప్రేమ సమాజం కార్యదర్శి హరిమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవమాత మహోత్సవాలు ప్రారంభం


తేరు స్వరూపాన్ని ప్రారంభిస్తున్న ఫాదర్ జాన్ ప్రకాశ్

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) ఆధ్వర్యంలో దేవమాత మోక్షారోపణ ఉత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ నేతృత్వంలో దివ్యబలిపూజ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముందుగా సిలువ గుర్తు వీధిలో దేవమాత పతాకాన్ని పీపీసీ అధ్యక్షుడు వై.వి.అమర్‌దీప్ ఆవిష్కరించారు. అనంతరం తేరును ఊరేగించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్లు, పీపీసీ సభ్యులు ఆదిరెడ్డి చార్లీ, పి.జి.ఆనందరావు, ప్రదీప్, బి.రమేష్, బేతా రాజు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు


రమాసహిత సత్యనారాయణస్వామి


సామూహిక వ్రతంలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: అధిక శ్రావణ శుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని ఇసుకకొండ(బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సామూహిక వ్రతాలు ఆచరించారు. వేకువజాము నుంచే స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా సిబ్బంది క్యూలైన్లు ఏర్పాటు చేసి, మంచినీటి సదుపాయం కల్పించారు. ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.నరసింహాచార్యులు నేతృత్వంలో వ్రతాలు చేశారు. గాజువాక, నరసాపురం నుంచి వచ్చిన మహిళలు కోలాటం ప్రదర్శించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ధ నాగ జగదీష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రహదారులు నిత్యం పరిశుభ్రం చేయాలి

జగదాంబ: ప్రధాన రహదారులు నిత్యం పరిశుభ్రం చేయాలని జోన్–4 ఏఎంహెచ్‌వో సత్యనారాయణ సూచించారు. మంగళవారం ఆయన జీవీఎంసీ 35వ వార్డు టౌన్‌కొత్తరోడ్డు వద్ద రహదారులను దగ్గరుండి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌వో మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రహదారులు, మార్కెట్లు, వీధులు, కాలువలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. చెత్తకుప్పలు రోడ్ల పక్కన ఉండకుండా ఎప్పటికప్పుడు ఎత్తి యార్డుకు తరలించాలన్నారు. పారిశుధ్య కార్మికులు విధి నిర్వహణలో అలసత్వం వహించకూడదని హెచ్చరించారు. శానిటరీ సెక్రటరీలు, వార్డు ఇన్‌స్పెక్టర్లు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా సిబ్బందితో పనులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, వార్డు ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

నవరస మూర్తికి 'సురభి బాబ్జి' పురస్కారం


నవరస మూర్తికి పురస్కారం అందజేస్తున్న అతిథులు

సీతంపేట: రంగసాయి నాటక సంఘం 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పౌరగ్రంథాలయంలో జరిగిన ఈ వేడుకల్లో సురభి బాబ్జి సేవా పురస్కారాన్ని ప్రముఖ నటులు, దర్శకుడు, నాటక రచయిత పీవీ రమణమూర్తి (నవరస మూర్తి)కి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గంటి సాయి శివ, కార్తికేయ ప్రదర్శించిన కీచకుడు, సంజయుడు ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. గ్రంథాలయ అధ్యక్షులు ఎస్.విజయ్ కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, రంగస్థల నటులు దండు నాగేశ్వరరావు, బొట్టా వేణు, బొబ్బ ధవళేశ్వరరావు, చలసాని కృష్ణప్రసాద్, కొణతాల రాజు, బాదంగీర్ సాయి, మీగడ రామలింగస్వామి, మీగడ శశిభూషణ్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరు మృతి

ఆనందపురం : మండలంలోని వేములవలస సమీపంలో ఆరు లైన్ల రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్టు స్థానిక పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా, వీరఘట్టం మండలం, హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఉమ్మడాల చంద్రమౌళి, అతని భార్య వెంకటలక్ష్మి 15 ఏళ్ల క్రితం ఉపాధి కోసం విశాఖనగరం వలస వచ్చారు. దుర్గానగర్‌లో ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వెంకట లక్ష్మి తండ్రికి అనారోగ్యంగా ఉండడంతో గత నెల 29న భార్యా భర్తలిద్దరూ స్కూటీపై హుస్సేన్‌పురం వెళ్లారు. వెంకటలక్ష్మి తండ్రి వద్దే ఉండిపోగా చంద్రమౌళి గత నెల 31న బయలుదేరి తిరిగి దుర్గానగర్ వస్తున్నాడు. అతను వేములవలస సమీపానికి చేరుకునే సరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో చంద్రమౌళి (43) తూలి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమైంది. ఈ మేరకు అంబులెన్స్‌లో చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బంధువులు ఎవరూ సకాలంలో రాకపోయేసరికి కేజీహెచ్ శవాగారంలో మృతదేహాన్ని భద్రపరిచారు. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రామాయణం మహాకావ్యం


ప్రసంగిస్తున్న ప్రముఖ రచయిత డాక్టర్ డీవీ సూర్యారావు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితాపీఠంలో ప్రముఖ రచయిత డాక్టర్ డీవీ సూర్యారావు 'రామాయణంలో సోదరానుబంధం'పై ప్రసంగించారు. రామాయణం జాతీయ మహా కావ్యమని, జాతి యొక్క సంస్కృతి, సనాతన ధర్మాన్ని అద్దంపట్టే విధంగా రామాయణాన్ని విశ్వకవి వాల్మీకి అందించారన్నారు. సకల ధర్మాలు, కుటుంబంలోని సంబంధాలు ఎలా ఉండాలో రామాయణంలో తెలియజేశారన్నారు. భారతీయ సమాజంలో కుటుంబ వ్యవస్థ చాలా బలమైనదని, మన సంస్కృతి బలంగా ఉండడానికి కుటుంబ వ్యవస్థే కారణమన్నారు. రామాయణంలో నాలుగు చోట్ల అన్నదమ్ముల అనుబంధం కన్పిస్తుందన్నారు. అయోధ్యలో రామలక్ష్మణ, భరత శతృఘ్నులు, కిష్కిందలో వాలిసుగ్రీవు లు, లంకలో రావణ విభీషణులు, అలాగే పక్షి సోదరులు సంపాతి, జటాయువులు అన్నదమ్ముల గురించి వివరించారు. లలితానంధభారతీ స్వామి మాట్లాడుతూ లలితాపీఠం ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయమని కొనియాడారు. ఇక్కడ నిత్యం హోమాలు, ఆధ్యాత్మిక పూజా కార్యక్రమాలు, సాహిత్య కార్యక్రమాలు జరుగుతుండటం విశేషమన్నారు. త్వరలో లలితాపీఠంలో నన్నయ్య సహస్రాబ్ది ఉత్సవాలు జరగనుండటం అభినందనీయమన్నారు. అనంతరం లలితాపీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.